క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందిస్తున్న బెహరా విజయ చైతన్య

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు జిల్లా పరిషత్ పాఠశాల వద్ద అల్లూరి సీతారామరాజు ఆటో సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బెహరా విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బెహరా విజయ చైతన్య ప్రారంభించారు. పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ అందించారు. కార్యక్రమంలో ఆటో సంక్షేమ సంఘ సభ్యులు వి.ప్రకాష్, దాడి సుందర్రావు, వై. సాయికుమార్, ఎం. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెంటమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే పి.గణబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపతో అందరూ క్షేమంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, పొట్టిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్కాపురం: కర్ణాటకలో కాంగ్రెస్ అఖండ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సోమవారం సంబరాలు నిర్వహించుకున్నారు. 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద జరిగిన సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నాయకుడు అంగ భానూజీ నర్సింహవర్మ మాట్లాడుతూ దేశంలో బీజేపీ నియంత పాలనను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం బాణసంచా వెలిగించి,రంగులు చల్లుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దాకరపు నూకరాజుయాదవ్, ఎం.డి.రజియాభేగం,దేవా తదితరులు పాల్గొన్నారు.

అనధికార వసూళ్లపై ఫిర్యాదు



అనధికారికంగా వసూలు చేస్తున్న వారు ఇచ్చిన రశీదులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లల పాలెం పార్కు చుట్టు పక్కల వ్యాపారాలు సాగిస్తున్న వారి నుంచి వాకర్స్ క్లబ్ నిర్వాహకులు అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని శ్రీనివాస్ అనే వ్యక్తి సోమవారం జీవీఎంసీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వని వారిని వేధిస్తున్నారని పేర్కొనారు. జీవీఎంసీకి చెందిన వాకింగ్ పార్కు నిర్వహణను జీవీఎంసీ శానిటరీ అధికారులు చూసుకుంటారని, దీనిలో క్లబ్ నిర్వాహకుల ఉత్సాహం ఏంటని అని ప్రశ్నించారు. అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి!

- రసాయనాల విడుదలతో ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

సింధియా: కాలుష్య కోరల్లో చిక్కి పారిశ్రామిక ప్రాంతం ఉక్కిరి బిక్కిరి అవుతోంది. శ్రీహరిపురం ప్రాంతంలో ఉన్న కోరమాండల్, మల్కాపురం ప్రాంతంలో ఉన్న హెచ్‌పీసీఎల్, సింధియా పరిధిలోని ఆంధ్రా పెట్రో కెమికల్ వంటి పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను విషపూరితం చేసింది. ఈ ప్రాంతాల్లోని మంచినీటి బావులు, చెరువులు రసాయనాలతో నిండిపోతున్నాయి. కోరమాండల్, హెచ్‌పీసీఎల్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల శరీరం మండుతోందని, కళ్లు మంటలు, శ్వాసకోశ వ్యాధులు తలెత్తుతున్నాయని స్థానికులు గగ్గోలుపెడుతున్నారు. సాయంత్రం వేళల్లో పరిశ్రమల నుంచి వెలువడే రసాయనాలతో ఊపిరి అందక ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

భయం.. భయం

శ్రీహరిపురం ప్రాంతంలోని కోరమాండల్, హెచ్‌పీసీఎల్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం ఒక ఎత్తయితే..ఆధునికీకరణ పేరుతో నగరానికి సహజ రక్షణగా ఉన్న కొండలన విచ్ఛిన్నం చేయడంతో పారిశ్రామిక ప్రాంతం భవిష్యత్తు ప్రమాదానికి హేతువుగా గోచరిస్తుంది.



హెచ్‌పీసీఎల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ

కాలుష్య నియంత్రణ గణాంకాల ప్రకారం.....

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదిక ప్రకారం పారిశ్రామిక ప్రాంతం గాలిలో 57 పాయింట్లు, నీటిలో 58 పాయింట్లు, భూమిలో 55 పాయింట్లు కాలుష్యమయమైందని తెలిపింది. అంటే మొత్తం మీద 70 పాయింట్లతో పారిశ్రామిక ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుందని తెలుస్తోంది. సమగ్ర పర్యావరణ కాలుష్య సూచీ ప్రమాణాల ప్రకారం 70 పాయింట్లు దాటితే ఆ ప్రాంతం నివాస యోగ్యం కాదు. తూర్పు నావికాదళం ఇప్పటికే 10కి పైగా ఉన్న ప్రాంతాలను నివాసయోగ్యం కాదని గుర్తించి, అక్కడి నుంచి తమ సిబ్బందిని ఖాళీ చేసేయాలని ఆదేశించింది. ఒక వేళ ఖాళీ చేయకపోతే హెచ్‌ఆర్‌ఏ నిలిపి వేస్తామని హెచ్చరించింది.



కోరమాండల్ పరిశ్రమ నుంచి..

వాసన భరించలేకపోతున్నాం



కోరమాండల్, హెచ్‌పీసీఎల్, ఆంధ్రా పెట్రో కెమికల్స్ వంటి పరిశ్రమల నుంచి వెలవడే రసాయనాలతో వస్తున్న వాసన భరించలేకపోతున్నాం. తరచూ అనేక శ్వాస సంబంధిత వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల చుట్టు తిరుగుతూ ఆర్థికంగా నష్టపోయాం. ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం లేదు.
– పెట్టా సత్యవతి, మల్కాపురం

ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం.



శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల వ్యాధులతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. వర్షం పడే సమయంలో రసాయనాలను వదిలేస్తున్నారు. ఆ సమయంలో ఊపిరి అందక నరకం అనుభవిస్తున్నాం.
– నక్కా సూర్యనారాయణ, దుర్గానగర్

ఖాళీ చేయాలనుకుంటున్నాం



కాలుష్యం భరించలేక ఇళ్లు ఖాళీ చేసి వెళ్లి పోదామనుకుంటున్నాం. రసాయనాలతో కూడిన కాలుష్యం వల్ల పిల్లల ఎదుగుదలలో తేడా ఉంటోంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే తప్పా ఈ ప్రాంతంలో ఉండలేం.
– మజ్జి మాలినాయుడు, గుడివాడ అప్పన్నకాలనీ

జోన్-5 'స్పందన'కు 4 వినతులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. ఆర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జీ.వి. కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, పబ్లిక్ హెల్త్‌కు 01, యూసీడీకి 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరత్‌కుమార్, వాటర్ వర్క్స్ ఈఈ-2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ యూసిడీ కె.శైలజ, సీడీవో పద్మావతి పాల్గొన్నారు.

నేవీ హాస్పిటల్ పాలిక్లినిక్ సందర్శన



ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు జ్ఞాపిక అందజేస్తున్న నేవీ అధికారులు

సింధియా: ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణిలో ఉన్న నేవీ హాస్పిటల్ పాలి క్లినిక్‌ను సోమవారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సందర్శించారు. అక్కడి అధికారులతో ఆయన మాట్లాడి ఆస్పత్రి సిబ్బంది, రోగులకు కావాల్సిన భవిష్యత్తు అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలను పాలి క్లినిక్‌కు అంబులెన్స్, రోగుల కోసం కుర్చీలు, ఇతర అవసరాల నిమిత్తం అందజేస్తానని జీవీఎల్ హామీ ఇచ్చారు. నేవీ హాస్పటల్, పాలి క్లినిక్ అభివృద్ధి కోసం రక్షణ, ఆర్థిక మంత్రిత్వ శాఖలకు తెలియపరిచి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. నేవీ అధికారులు ఆయనకు జ్ఞాపిక అందజేశారు.

ఘనంగా తొలేళ్ల సంబరం



బుచ్చిరాజుపాలెంలో అమ్మవారి ప్రతిమలు ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయ పండగ సందర్భంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా జరిగింది. సాయంత్రం ఎన్ఏడీ సమీప సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద నుంచి అమ్మవారి ప్రతిమలను భక్తులు ఊరేగించారు. ముందుగా ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ప్రతిమలను తలపై పెట్టుకుని బుచ్చిరాజుపాలెంలోని పలు వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు త్రివేణి, గ్రామాభ్యుదయ సేవా సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రధాన పండగ..

బంగారమ్మ అమ్మవారి ప్రధాన పండగ మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

యువగళానికి మద్దతుగా పాదయాత్ర



గోపాలపట్నం నుంచి ర్యాలీగా బయలుదేరిన గణబాబు తదితరులు

గోపాలపట్నం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టి సోమవారానికి 100 రోజులు అయిన సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఎన్ఏడీ జంక్షన్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయ సమీపంలో కేక్ కత్తరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడిరమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

ట్యాంకర్‌ను ఢీ కొట్టిన లారీ

- లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

సబ్బవరం: అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిలో ఇరువాడ వద్ద సోమవారం రెండు వాహనాలు ఢీ కొట్టుకున్న ఘటనలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు దరి చేబ్రోలులో ఓ హేచరీ నుంచి చేపల లోడుతో లారీ ఆదివారం 11 గంటలకు కోల్‌కతా బయలుదేరింది. సోమవారం ఉదయం ఇరువాడ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న వాటర్ ట్యాంకర్‌ను చేపల లోడు లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కు పోయాడు. పోలీసులు క్రేన్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీయించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రెండు కాళ్లు విరిగిపోయినట్లు సబ్బవరం హెచ్‌సీ సత్యనారాయణ చెప్పారు. క్షతగాత్రుడిని 108 లో అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్ చంబూరాజ్ బహర్

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట : ఢిల్లీలో మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యూ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నిరసనకారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, నేటి వరకు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు



గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం గ్రామానికి చెందిన అందవరపు శ్రీనివాసు అప్పల బాధలు తాళలేక సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఆ సమయంలో వాట్సప్ స్టేటస్‌లో తాను అప్పలు పాలయ్యాయని.. ఈఎంఐలు కట్టలేక చనిపోతున్నానని, పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద దొరుకుతానని మెసేజ్ పెట్టాడు. దీంతో తల్లి దండ్రులు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహారావు, ఎస్ఐ అప్పలనాయుడు వెంటనే స్పందించి దర్యాప్తు చేపట్టారు. శ్రీనివాస్ సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా పెందుర్తి, అక్కడి నుంచి విశాఖ మెయిన్ స్టేషన్‌లో వెతికారు. అక్కడా కనిపించక పోవడంతో మళ్లీ సెల్ లొకేషన్‌ను వెతికారు. (గోపాలపట్నం) సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద ఉన్నట్లు గుర్తించి వెంటనే వెళ్లి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు గోపాలపట్నం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

- ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్



మాట్లాడుతున్న ఎస్ఏ రెహమాన్

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ గెలిస్తేనే పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తుందని ఆ పార్టీ ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జీవీఎంసీ 89వ వార్డు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 89వ వార్డు అధ్యక్షుడిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్టు తెలిపారు. అధిష్టానం తదుపరి నిర్ణయం తెలిపేవరకు వార్డులో కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీ వేశామని తెలిపారు. స్థానిక నాయకులైన ఐయితంశెట్టి గోపి, ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు, గేదెల మురళీ కృష్ణ ఉమ్మడిగా కార్యకలాపాలు నిర్వహిస్తారని చెప్పారు. వార్డుకు సంబంధించిన సమస్యలు వీరి ముగ్గురి దృష్టికి తేవాలని సూచించారు. అభివృద్ధిలో ఆర్పీలు, వలంటీర్లు కీలకమని చెప్పారు. ఏ సమస్య ఉన్నా నేరుగా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు నివేదించవచ్చని తెలిపారు. ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల పైడిరాజు, ఐతంశెట్టి గోపి, గేదెల మురళీకృష్ణ, మళ్లా శ్రీనివాసరావు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

కాగితంతో కళాకృతులు



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

మల్కాపురం: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం చిన్నారులకు కాగితాలతో వివిధ కళాకృతులు తయారీపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ కుమారు మాట్లాడుతూ వివిధ అంశాలపై శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గా సోమవారం కాగితాలతో బొమ్మలు,పువ్వులు,నౌకలు,మందిరాలు ఇలా పలు నమూనాల తయారీలో శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎస్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులు ఆటపాటలతో పాటు ఇలాంటి అంశాల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ అధికారి అనసూయాదేవి, రచయితలు,కవులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గుణిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మినగర్‌కు చెందిన బత్తుల వెంకటరమణ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా జీవీఎంసీ 91, 92వ వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ బీమా ద్వారా రూ. లక్ష మంజూరు కాగా తక్షణ సాయంగా రూ.10 వేలు అందించామని తెలిపారు. మిగిలిన సొమ్ము అతని కుటుంబ సభ్యుల ఖాతాలో జమ అవుతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, ఆర్పీ నూకరత్నం, సచివాలయ కార్యదర్శి మనోహరి, వలంటీర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలపై కార్పొరేటర్ ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య సోమవారం ములగాడ విలేజ్ ప్రాంతంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ములగాడ విలేజ్ పరిధిలో ప్రజా సమస్యలు తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతానికి వెళ్లిన ఆమె తొలుత ఇక్కడ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులు అందుబాటులో ఉంటున్నారా లేదా.. సిబ్బంది సమయానికి విధులకు వస్తున్నారా లేదా,రోగులకు అవసరమైన మందులు ఉన్నాయా తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం అక్కడ సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. పేదలను దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలు అందించాలని సూచించారు.

రేపటి నుంచి వ్యక్తిత్వ వికాస తరగతులు

- వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- పేర్ల నమోదుకు ఆహ్వానం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి కళాశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, లంకా వెంకట సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగిన దృష్ట్యా వ్యక్తిత్వ వికాసం ప్రాధాన్యం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులు తడబాటు లేకుండా తమ భావాలను వ్యక్తపరచడంతోపాటు జీవన నైపుణ్యాల అభివృద్ధి, కెరీర్ ప్లానింగ్ వంటి అంశాలపై నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ఆవరణలో నాలుగు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్, ఆపైన చదువుకుంటున్న విద్యార్థులందరూ హాజరు కావచ్చని చెప్పారు. విద్యార్థులు తమ పేర్లను వాకర్స్ పార్కులోని కార్యాలయంలో నేరుగా లేదా 94901 84360, 83091 57522, 94404 01874 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



823వ రోజు ఉక్కుదీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పోరాడాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 823వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న సంస్థలోని పలు విభాగాల కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం తహతహలాడుతోందన్నారు. విశాఖ ఉక్కు జోలికి వస్తే కార్మికులు, నిర్వాసితులు, ఆంధ్రరాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. దీక్షలు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవ్వరూ వచ్చినా అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణత్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.